# వ్యాస కౌముది



## మనభారతం డా.వల్లూరుపల్లి శివాజీరావు

### ౨.పురోగమనం నుంచి తిరోగమనం - II

ఈ భూమండలంలో అద్వితీయమైన,అసమానమైన సంపద ,నాగరికత, సంస్కృతి, జ్ఞాన, విజ్ఞాన ప్రతిభలతో వేలాది సంవత్సరాలు (బ్రిటన్ మనదేశాన్ని కబళించడం మొదలు పెట్టిన 1757 వరకూ) తులతూగిన మన భారతదేశపు ఔన్నత్య చరిత్రగురించి నేను వ్రాసిన "ది గ్లోబల్ ఇండియా" అనే పేరుతో ఉన్న పుస్తకం జూలై 2009లో ఇండియాలో ప్రచురించబడింది. ఈ పుస్తకం అందరికీ అందుబాటులో ఉండదని భావించి అందులో పొందుపరిచిన కొన్ని ముఖ్యాంశాలని తెనుగులోకి అనువాదం చేసి 'కౌముది' మాసపత్రిక ద్వారా మీకు అందిస్తున్నాను.

ధారావాహికంగా వచ్చే ఈ ఉపాఖ్యానాలని మీరు చదివి, మీ పిల్లలకు కూడా తెలియచెప్పమని నా విన్నపం. ఈ విధంగా ఘనమైన మన భారతదేశ చరిత్ర భావితరాలకు కూడా చేరుతుందని నా చిన్న ఆశ..!!




### *ఆంగ్లేయ విద్యావిధానం వల్ల సంస్కృతభాషకు ఏ గతి పట్టింది?*

సంస్కృతం అనేక దేశ, విదేశీ భాషలకు ముఖ్యంగా యూరోపియన్ భాషలకు మాతృక. భారతదేశపు వేద, పురాణ, ఆధ్యాత్మిక, శాస్త్ర, విజ్ఞాన ఉద్గ్రంధాలకు సంస్కృతమే మూల భాష. మిగతా దేశభాషలకు అనుసంధానంగా ఉన్న సంస్కృతం భరతదేశ ప్రజలకి అనేక రంగాల్లో, వేలాది సంవత్సరాలు, మాధ్యమ భాషగా చెలామణి అయింది. ఈ భాషే రాజ్యాల ఎల్లలు దాటి, దేశమంతటిని వేలాది ఏళ్ళు ఐక్యంగా ఉంచిన పట్టుకొమ్మ. అలాంటి రాజభాష కేవలం 100 సంవత్సరాల వ్యవధిలోనే కాలగర్భంలో ఎలా కలిసిపోయిందీ అనే విషయం చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది కదూ!?

కల్నల్ బోడెన్ అనే ఆంగ్లేయుడు బొంబాయి సైన్యంలోనూ, ఈస్టిండియా కంపెనీలోనూ 25 ఏళ్ళు పనిచేశాడు. అపారమైన ధనవంతుడిగా మారి 1807 లో బ్రిటన్‌కు తిరిగివెళ్ళాడు. అతడు 1811, నవంబర్ 11 న మరణించాడు. అంతకు మూడు నెలల ముందే తన యావదాస్తినీ కూతురు ఎలిజిబెత్‌కు వ్రాసిచ్చాడు. ఆమె కూడా 1827 ఆగస్టు 24న చనిపోయింది. ఈమెకు చెందిన 25 వేల పౌండ్ల

ఆస్తిని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో బోడెన్ పేరుమీదుగా సంస్కృత పీఠాన్ని నెలకొల్పడానికి వినియోగించారు. దీని ముఖ్యోద్దేశం గురించి ఎలిజిబెత్ ఖననం చేయబడిన ట్రినిటీ చర్చిలో ఇలా వ్రాయబడి ఉంది.. "మన వారు సంస్కృత గ్రంధాలను అధ్యయనం చేస్తూ అనువదించాలి. ఈ విధంగా నేర్చిన విజ్ఞానాన్ని మన క్రైస్తవ విజ్ఞానంతో కలిపి ఇండియాలో వ్యాపింపచేస్తూ, భారతీయుల్ని క్రైస్తవులుగా మార్చడానికి ఉపయోగించాలి.."!!!

ఆశ్చర్యంగా ఉందికదూ..! ఇదంతా చరిత్రపుటల్లో దాగిన పచ్చి నిజం..!

ముందుగా సంపన్నులను ఆంగ్లభాషకి అలవాటు పడేలా చేస్తే మిగతా వాళ్ళు కూడా వాళ్ళని అనుసరిస్తారు - ఇదీ బ్రిటిష్ వారి పథకం..! ఐతే అంతకు కొన్ని శతాబ్దాలకు ముందే 1542 లో పోర్చుగీస్‌కి చెందిన జెస్యూట్స్ దక్షిణ భారతదేశంలోనూ, పశ్చిమ భారత దేశంలోనూ ఈ ఆలోచనను అమలు పరచినా అంతగా ఫలితాలు రాలేదు.

1860 నుంచీ ఇంగ్లండులోని సంస్కృత పీఠానికి అధిపతిగా వున్న మోనీర్ మోనీర్ విలియమ్స్ అనే అతను 1879లో ఇలా వ్రాశాడు "..ఎంతో బలంగా ఉన్న హిందూ మతం అనే కోటని సిలువను పట్టుకున్న మన సైనికులు చుట్టుముట్టి బలహీన పరచినప్పుడే క్రైస్తవ మత విజయం పూర్తవుతుంది.." తరువాత వచ్చిన సంస్కృతాచార్యులు కూడా ఇదే దోవలో నడిచారు. 1875లోనే సదరు మోనీర్ మోనీర్ తప్పుల తడకలుగా ఉన్న సంస్కృత - ఇంగ్లీషు పదకోశాన్ని ప్రచురించాడు. దీన్ని ఉపయోగించే బైబిల్‌ని సంస్కృతంలోకి అనువదించడం జరిగింది.

అప్పటి ఆంగ్ల సిద్ధాంతుల పన్నాగం ప్రకారం సంస్కృత భాష అనేది బ్రిటిష్ వారి సంస్కృతిని భారతదేశానికి దిగుమతిచేయడానికే గానీ, వాళ్ళు భారతీయ సంస్కృతిని నేర్చుకోడానికి కాదు. క్రైస్తవాధిపతుల సందేశాల ప్రకారం భారతీయులను బ్రిటిష్ జీవనసరళి ప్రకారం సంస్కరించి, ఆధునిక కాలానికి(వాళ్ళ దృష్టిలో)ప్రతినిధులుగా తీర్చిదిద్దాలి. దీన్ని ఆచరణలో పెట్టే ముందు మనదేశంలో ఉన్న సంస్కృతభాషలోని ఆధ్యాత్మిక, తత్వ, న్యాయ, చరిత్ర, శాస్త్ర, భూగోళ, జ్యోతిష, వైద్య, తర్క, మానవీయతా గ్రంధాలను సేకరించి బ్రిటన్ కు తీసుకెళ్ళారు. వాటిని అక్కడ చీకటి కొట్లలో కుప్పపోసి, కొన్నిటిని తగులబెట్టి, మిగతావాటిని వెలుగు చూడకుండానూ చేశారు.. ఇదీ వారి (అ)నాగరికత..!!

ఇలాంటి మానవీయత లోపించిన చర్యలతో బాటు 1835 నుంచి ఆంగ్లమాధ్యమాన్ని బలవంతంగా మనదేశమంతా రుద్దిన కారణంగా సంస్కృతభాష ప్రాముఖ్యత కాలక్రమేణా తగ్గిపోయింది. దేశ స్వాతంత్ర్యం వచ్చేసరికి దాదాపు అంతరించిపోయింది. దీని స్థానాన్ని కొంతవరకూ హిందీ భాష ఆక్రమించుకుంది. ఇంగ్లీషు శరాఘాతం ప్రాంతీయ భాషలకి కూడా తగిలింది. ఈ రోజున మన దేశంలో కర్ణాటకలోని మత్తూరు, హోసహల్లి గ్రామాల ప్రజలు మాత్రమే సంస్కృతాన్ని వాడుక భాషగా మిగుల్చుకున్నారు. మన పురోహితులుకూడా కేవలం మంత్రాలు చదవడనికి మాత్రమే సంస్కృతాన్ని ఉపయోగిస్తున్నారు.

## *భారతీయ సంస్కృతికి బ్రిటిష్ వారి వక్రీకరణ, వాళ్ళ కొత్త అర్థాలు*

1853లో మెకాలే, లండన్‌లో ఉన్న జర్మన్ భాషా తత్వశాస్త్రజ్ఞుడు ఫెడరిక్ మాక్స్ ముల్లర్ (1823-1900)ని ఋగ్వేదాన్ని ఇంగ్లీషులోకి అనువదించడానికి నియమించాడు. అనువదించిన ప్రతి పేజీకి 4 షిల్లింగులు జీతంగా తీసుకున్న ఈ పెద్దమనిషి తన అనువాద పుస్తకం అనేక వేల పేజీలు ఉండేట్లుగా వ్రాసి చాలా డబ్బు సంపాదించి కుబేరుడయ్యాడు. తద్వారా మన వేదసంస్కృతిని కూకటి వ్రేళ్ళతో పెకలించడానికి ఈ ఘనుడు ఆది గురువయ్యాడు.

ఈ పెద్ద మనిషి సంస్కృత భాషా పాండిత్యం ఎంత అధ్వాన్నంగా ఉందో ఆర్య సమాజ స్థాపకులు స్వామి దయానంద (1824-

83) ఇలా అన్నారు " తప్పటడుగులు వేస్తూ నడక నేర్చుకునే పిల్లవాడి లాంటిది అతని పాండిత్యం".

ఒకసారి స్వామి దయానంద స్వచ్ఛమైన, అసలు సిసలైన సంస్కృతం మాట్లాడితే అది ఏ భాషో తెలియని అజ్ఞాని ఈ మాక్స్‌ముల్లర్! ఈతనిని ఉద్దేశించే ఉపనిషత్తులతో ప్రభావితుడైన జర్మన్ తత్వవేత్త ఆర్థర్ షోపన్ హార్ (1845-1917) ఇలా అన్నాడు "గ్రీక్, లాటిన్ లాంటి భాషలను నేర్చుకునే పెద్ద క్లాసుల విద్యార్థులకంటే కూడా తక్కువ స్థాయిలో సంస్కృతాన్ని అర్థం చేసుకునే స్థితిలో ఉన్నారు, ఈ సంస్కృతానువాదకులమని చెప్పుకునే ఈ పెద్ద మనుషులు"

1853లో మాక్స్ ముల్లర్ చేసిన సంస్కృతానువాదపు తప్పులలో ముఖ్యమైనది 'ఆర్య' అనే పదం. ఆర్య (Aarya) మాటకు మూలం ఋ (ర,r) . దీనికి 'అ'(A) ను కలిపితే వచ్చేది 'అర్(అర,ar). ఇలా 'అ'ని కలిపినందువల్ల 'ఋ'(ర) కు ఉన్న వ్యతిరేకార్థం పోతుంది. ఈ పదాన్ని సాగదీస్తే 'ఆర్' (aar) అని వస్తుంది. దీని నానార్థాలు 'శ్రేష్ఠం, ఉత్తమం, గౌరవం, మర్యాద' మొదలైనవి. ఈ సంబోధనతో 'యజమాని, ప్రభువు, గొప్పవాడు, గౌరవనీయుడు' అని ఒక వ్యక్తిని పిలవవచ్చు. అలాంటి వ్యక్తిని నానార్థాలుగా ' ఉపాధ్యాయుడు, ఉద్యోగం ఇచ్చేవాడు, మామ, పెద్దవాడు, స్నేహితుడు, జ్ఞానోదయం కలిగిన వాడు' చెప్పుకోవచ్చు. ఇంకోలా చెప్పాలంటే ఇంగ్లీషులో 'సర్' అనే పదం లాంటిది. ఈ 'ఆర్య' పదాన్ని పదే పదే 'మహభారత్' టెలి సీరియల్‌లో మీరు వినే వుంటారు.

ఐతే ఋగ్వేదంలో మాత్రం ఈ 'ఆర్య' అనే పదాన్ని వేదకాలపు ఆర్యులని సంభోదించడానికి మాత్రమే వాడేవాళ్ళు. ఈ వేదార్యులు దీనిని 'ప్రభువులమైన మేము' అని తమను పిలుచుకోడానికి, ఇతరులతో పిలిపించుకోడానికి ఉపయోగించారు. ఈ సంభోదన ద్వారా తాము ఇతరులకు భిన్నమైన వాళ్ళమని చెప్పేవారు. ఇంకా చెప్పాలంటే వేదాలలో ఈ ఆర్య పదం మీద ఉన్న హక్కు కేవలం 'పురు' వంశస్తులకే చెందింది. ఇతర వంశస్తులని ఈ పదంతో సంభోదించేవారు కాదు. ఆ రోజుల్లో ఆర్య సంస్కృతి భాసిల్లిన సరస్వతీ నదీమ తల్లి ప్రవహించిన కురుక్షేత్రం - కాశీ మధ్య భూమిని 'ఆర్యావర్తం' అని కూడా అన్నారు.

కాని మాక్స్ ముల్లర్ 'ఆర్య' అనే పదం 'ఆర్'(Aar) అనే అక్షరం నుంచి వచ్చిందని అనువదించి తప్పుచేశాడు. 'ఆర్' అంటే 'దున్నడం, సాగుచేయడం'. ఈ పదాన్ని ఒక వ్యక్తిని 'రైతు, భూపతి'గా సంభోదించడానికి, తద్వారా ఒక జాతికి సంబంధించిందని వాదించాడు. ఐతే వేదాలలో ఎక్కడా ఈ పదాన్ని ఒక జాతిని, భాషను ఉద్దేశించి వ్రాసిన దాఖలాలు లేనే లేవు. ఈ అనువాదాన్ని ఆధారం చేసుకుని యూరోపియన్లు వెంటనే 'ఆర్యజాతి' సిద్ధాంతాన్ని లేవదీసి ప్రచారం చేశారు. దీన్ని గురించే మాక్స్‌ముల్లర్ 1859లో బ్రిటిష్ మంత్రి డ్యూల్ ఆఫ్ ఆర్గెల్‌కి ఇలా వ్రాశాడు " ఇండియాను మనం గతంలో ఒకసారి జయించాము. ఈ రెండో విజయం విద్య ద్వారానే జరగాలి.. ఈ ప్రాచీన మతం అంతమయ్యే ఈ దశలోనైనా క్రైస్తవ మతం వడివడిగా ముందుకి అడుగు వెయ్యకపోతే అది ఎవరి తప్పు అవుతుంది?"

ఈ ఆర్య జాతి సిద్ధాంతకర్త 1866, డిసెంబర్ 9న, తన భార్య 'జార్జియానా' కు వ్రాసిన ఉత్తరంలో ఇలా చెప్పాడు "ఈ అనువాద ఫలితంగా వచ్చే పరిణామాలను నేను చనిపోయేలోగా చూడలేనేమో.. కాని ఈ నా అనువాదం మాత్రం ఇండియా విధిని శాసిస్తూనే ఉంటుంది, మిలియన్ల ప్రజల ఆత్మలను నిర్దేశిస్తునే ఉంటుంది. ఈ ఋగ్వేదం వీళ్ళ మతానికి మూలవేరు. వేలాది ఏళ్ళుగా పెరిగిన ఈ మూలవేరుని కూకటి వ్రేళ్ళతో సహా పెకలించి..తద్వారా వచ్చే పరిణామాలని వీళ్ళకి ప్రత్యక్షంగా చూపిస్తాను..."

19 వశతాబ్దం మధ్యనుంచి యూరోపియన్లు తమ క్రైస్తవమతం చాలా ఉన్నతమైనదని, మిగతా మతాలు ముఖ్యంగా అనేక విగ్రహాలను ఆరధించే హిందూమతం క్రూరమైనదనీ ప్రగాఢంగా విశ్వసించారు. అందుకనే క్రైస్తవులు కాని వారిని భయపెట్టి, ప్రలోభాలకు లోనుచేసి, అవసరమైతే బలవంతంగానైనా క్రైస్తవులుగా మార్చి వాళ్ళని పునీతం చేయాలని ధృఢ సంకల్పబద్ధులయ్యారు. సరిగ్గా ఇదే సమయంలో వచ్చిన మాక్స్‌ముల్లర్ సిద్ధాంతం వేదాలను వక్రీకరించి మనలోనే కొంతమందికి వాటిమీద అపనమ్మకం కలిగించింది.

క్రీ.పూ. 3102 లో శ్రీకృష్ణుని మరణం, 563లో గౌతమ బుద్ధుని జననం మధ్య అంటే 2539 సంవత్సరాల కాలం వందలకొలది

రాజులగురించి పురాణాలలో పొందుపరచిన విషయాలన్నీ పచ్చి అబద్ధాలని సిద్ధాంతీకరిస్తూ, వాస్తవాలని వక్రీకరించి ప్రచారం చేశారు.

బ్రిటన్ - జర్మనీ జాతీయవాదులు, ఆర్య పాలనా వాదులు సిద్ధాంతీకరించిన క్రైస్తవ కాలమానం ప్రకారం ఈ భూగోళం క్రీ.పూ 4004, అక్టోబర్ 23 ఉదయం 9 గంటలకు సృజించబడింది. 'గ్రేట్ ఫ్లడ్' క్రీ.పూ 2500 లో వచ్చింది. ఈ కారణంగా నిరాశ్రయులైన ఇండో-యూరోపియన్ భాషలు మాట్లాడే ప్రజలు కాకేషియన్ పర్వతాలు దాటి అక్కడక్కడా ఆగుతూ నాలుగు దశలలో ఇండియా వైపుకు వలస వెళ్ళడం ప్రారంభించారు. క్రీ.పూ 2000 నుంచీ 800 వరకు వీళ్ళు ఇండియా చేరి స్థిరపడి ఒక ఉన్నతమైన నాగరికతను, సంస్కృతిని నెలకొల్పారు.

ఇంకా మన వేదాల విషయంలో ఎం చెప్పారో చూడండి.. క్రీ.పూ 1500 లో ఋగ్వేదం తామే వ్రాశామని యూరోపియన్లు ప్రచారం చేశారు. ఐతే ఋగ్వేదంలో యూరోపియన్ల వలసల ప్రస్తావన ఎక్కడా లేదనే విషయాన్ని తెలుసుకుని దీన్ని క్రీ.పూ 1400 అని సవరించారు. తర్వాత వచ్చిన సామ , యజుర్, అథర్వ వేదాల పుట్టుక క్రీ.పూ 1200 - 900 మధ్య జరిగిందన్నారు. ఆ తరువాతి బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తులు క్రీ.పూ 900-500 మధ్య వచ్చాయట..!!

అనాగరికులు, దేశద్రిమ్మరులుగా తిరిగిన తమ పూర్వీకులు అజ్ఞానులు కదా మరి వేదాలలో పొందుపరచిన ఆధ్యాత్మిక, తత్వ, సంస్కృతి వగైరా విషయాలపై ఎలా వ్రాయగలిగారనే విషయం గురించి ఈ యూరోపియన్లకి కించిత్ కూడా అనుమానం రాలేదు. ఈ అనుమానం వచ్చిన కొద్దిమంది యూరోపియన్ పండితులు ఈ అనుమానాలని వేలెత్తి చూపించినా అహంకారవాదుల అపభ్రంశపు అవాస్తవాలే నిజాలుగా చలామణి అయ్యాయి.

ఈ వక్రానువాద ఫలితంగా రూపొందిన 'ఆర్యజాతి' సిద్ధాంతాన్ని జెర్మన్‌లు తమకు అనుకూలంగా మలచుకున్నారు. దాని ఫలితం 20 వశతాబ్దంలో వాళ్ళ కారణంగా జరిగిన రెండు ప్రపంచ యుద్ధాలు, కోట్లాది మానవుల దుర్మరణం..! ఈ రోజుకీ ఈ పస లేని సిద్ధాంతానికి అక్కడక్కడా ఆదరణ ఉంటూనే ఉంది. దీనిని ఉపయోగించే భారతీయులను విడదీసి, వారిలో అనైక్యతను పెంచి, పాలించి, చివరకు విభజించి అనేక దీర్ఘకాలిక సమస్యలను సృష్టించి వెళ్ళారు ఈ ఆంగ్లేయ ఘనులు...!

ఈ యూరోపియన్లు వ్రాసిన తప్పుడు వ్రాతల ఆధారంగానే ఇండియా గురించి అమెరికన్లు కూడా కొన్ని పుస్తకాలు వ్రాశారు. వీటినే నిజమని నమ్మేవాళ్ళు ఇప్పటికీ ఎక్కువ సంఖ్యలోనే ఉన్నారు. నాతో బాటు, నా తరం వారందరూ బ్రిటిష్ వాళ్ళ గొప్పదనం ప్రతిబింబించే చరిత్ర పుస్తకాలనే చదివారు. 1960 దశకం నుండి వీటిల్లో కొన్ని మార్పులు చొప్పించినా వామపక్షనేతల వల్లా, హిందూమతేతర పెద్దల వల్ల నిజాలన్నీ ఇంకా పూర్తిగా వెలుగు చూడలేదు. నిష్పాక్షిక చరిత్రకారుల, వేద పండితుల పరిశోధనా ఫలితాలు ఇంకా మనదేశ ప్రజలకు కూడా క్షుణ్ణంగా తెలియడం లేదు. గోరంత ఉన్న అమెరికన్ల చరిత్ర ప్రాపంచికమైతే, మరి కొండంత ఉన్న భారత చరిత్రకు ఎందుకు అంత ప్రాచుర్యం కలగలేదనే విషయం ప్రతి భారతీయుడికీ ఆవేదన కలిగించే విషయం..!

## *బ్రిటిష్ వాళ్ళు భారతీయుల్ని నిరుపేదలుగా ఎలా మార్చారు?*

ఆంగ్లేయులు హద్దు, అదుపు లేని విధంగా వ్యవసాయ, అడవి సంపద అంతా బలవంతంగా లాక్కుని మనవారిని పేదరికంలోకి నెట్టి వేశారు. వ్యవసాయ ఉత్పత్తులనుంచి 70 శాతం పన్నులు వసూలు చేసి నడ్డి విరగ్గొట్టారు.. బ్రిటిష్ ఇండియా కంపెనీ అంతులేని ధనదాహం తీర్చడానికి అధికారులు చేతికందినంత ధనాన్ని , ఉత్పత్తులను బలవంతంగా స్వంతం చేసుకోవడమే కాక, తమకు ఉచిత సదుపాయాలకోసం రైతులను, ఉత్పత్తిదారులను నిరంతరం జలగల్లా పీడించేవారు. కొన్ని ప్రాంతాలలో వందలఏళ్ళుగా సాగవుతున్న జీవనాధార పంటలకు బదులుగా, బ్రిటిష్ వాళ్ళ ఎగుమతులకోసం గంజాయి, ఇండిగో, జనపనార, కాఫీ, తేయాకు లాంటి వాణిజ్య

పంటలను బలవంతంగా సాగుచేయించారు. దీని ఫలితమే ఆహారధాన్యాల దిగుబడి తగ్గడం, తద్వారా ధరలు పెరగడం, ప్రజలు అష్టకష్టాలు పడడం..!

దీనితో బాటుగా బ్రిటన్ నుంచీ ఇండియాకి దిగుమతుల్ని పెంచారు, కానీ ఇండియాలోని పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతిని అడ్డుకున్నారు. ఇందువల్ల మన దేశీయ పరిశ్రమలన్నీ మూతబడి సంపన్నులు కూడా దారిద్ర్య రేఖకు దగ్గరయ్యారు. మొగల్ రాకుమారుడు ఫిరోజ్ షా 1857 లో వెలిబుచ్చిన ఆవేదన ఇలా ఉంది.. "యూరోపియన్లు వారి వస్తువులను ప్రవేశ పెట్టడం ద్వారా మన దేశంలోని చేతివృత్తుల నోళ్ళుకొట్టారు. చేనేత పనివారు, దర్జీలు, వడ్రంగులు, కంసాలీలు, చెప్పులుకుట్టేవారు..ఇలాంటి వారంతా వేల యేళ్ళతరబడి వస్తున్న తమ వృత్తులను పోగొట్టుకుని బిచ్చగాళ్ళుగా మారారు.."

బ్రిటిష్ రచయిత థామస్ లోవె 1860లో ఈ విధంగా తన విచారాన్ని వ్యక్తపరచాడు.." ...దేశీయ కళలు, ఉత్పత్తులు భారతదేశపు ప్రతిష్ఠను వేలాది ఏళ్ళుగా పశ్చిమదేశాలను ఆశ్చర్యపరచే స్థాయిలో ఉండేవి. అలాంటి కీర్తి జ్యోతి ఈ నాడు ఆరిపోయింది..ఒకప్పుడు ఎంతో ఖ్యాతి గడించిన పట్టణాలు ఇప్పుడు శిథిలాలుగా మారాయి.."

అంతులేని ధనదాహంతో నిండి ఉన్న బ్రిటిష్ అధికారులు రైతులను, వర్తకులను, ఉత్పత్తిదారులను హింసించడం ఒక నిరంతర, సామాన్య చర్య ఐపోయింది. బాధిత ప్రజలు కోర్టులను ఆశ్రయించినా ఫలితంలేదు. బ్రిటిష్ పార్లమెంటులో Torture Commission కమిషన్ 1856లో ఇచ్చిన నివేదికలో ఇలా ఉంది.."కంపెనీ అధికారులు ప్రజలను హింసించడం ఎప్పుడూ ఆపలేదు, చేసే వారినీ ఆపలేదు..."

అప్పటి గవర్నర్ జనరల్ డల్హౌసీ "అధికారులు ప్రజలను చిత్రహింస పెట్టడంలోనూ, అకారణంగా జైలు పాలు చేయడంలోనూ ఎన్నో అకృత్యాలు, దుష్కృత్యాలు చేశారనడానికి తిరుగులేని సాక్ష్యాలున్నాయి.." అని ఒప్పుకున్నాడు.

## *కరువు కాటకాల కథా కమామీషు*

దేశ సంపద త్వరితగతిని తగ్గటంతో బాటు, పారిశ్రామిక వ్యవసాయ ఉత్పత్తులు గణనీయంగా తగ్గదం వల్ల వచ్చిన పరిణమాలే తరచుగా సంభవించిన కరువు కాటకాలకి మూలకారణం.

క్రీస్తుశకం 1005 వరకూ కరువు మూడుసార్లు వస్తే, ఆ తరువాత 700 సంవత్సరాల మహమ్మదీయుల పాలనలో అది 14 సార్లకు పెరిగింది. ఇంకా ముందుకి వస్తే 1770-1900 మధ్య అంటే కేవలం 130 సంవత్సరాల ఆంగ్లేయుల పాలనలో తీవ్రపరిణామాలకు కారణమైన కరువుకాటకాలు 35 సార్లు తమ పంజా విసిరాయి. ప్రభుత్వ గిడ్డంగులలో ధాన్యం నిలవలు పుష్కలంగానే ఉన్నా, 1770లో వచ్చిన బెంగాల్ కరువు మూలంగా ఒక కోటిమంది - అంటే ఉమ్మడి రాష్ట్రంలోని 35 శాతం రైతులు - మరణించారనేది పచ్చి నిజం! అధికారుల లెక్కలలో 1800-1850 మధ్య 24 సార్లు వచ్చిన కాటకాలవల్ల 1.1 కోట్ల మంది చనిపోయారని నమోదై ఉంటే, వాస్తవానికి అంతకు నాలుగురెట్ల మంది అసువులు బాశారు. 1854-1901 మధ్యలో 2.9 కోట్లమంది ఆకలితో అలమటిస్తూ కళ్ళుమూశారని ప్రభుత్వమే నిస్సిగ్గుగా ప్రకటించింది. కరువు విపత్తుద్వారా ఇంతటి నరమేధం ప్రపంచ చరిత్రలో ఎన్నడు జరగలేదని యూరోపియన్ చరిత్రకారులే ఒప్పుకున్నారు. ఈ విషయాలన్నీ వింటుంటే ఇప్పటికీ మన హృదయం ద్రవించకుండా ఉండదు..

విధి వైపరీత్యాల వల్లనే కరువు, కాటకాలు వచ్చాయని ఆంగ్లేయ ప్రభుత్వం సమర్థించబోయింది కానీ అసలు కారణాలు అనేకం. ఒక కారణం ఇదీ - అప్పటి బ్రిటిష్ ప్రభుత్వానికి వడ్డీ వ్యాపారస్తులు వెన్నెముకలుగా నిలిచారు. వాళ్ళ కబంధ హస్తాలలో చిక్కుకున్న రైతులు చేసిన అప్పులు, వాటికి చక్రవడ్డీలు తీర్చలేక ఆస్తులను పోగొట్టుకుని రోడ్డున పడ్డారు. అందుకనే బ్రిటిష్ పాలనలో భారత రైతులు

"అప్పుల్లో పుట్టి, అప్పుల్ని వారసత్వంగా స్వీకరించి, అప్పుల్లో జీవించి అప్పుల్లోనే చనిపోయారు.." అని అప్పటి ఆర్థిక నిపుణులే సెలవిస్తే, ఆర్థికశాస్త్ర అధ్యయనం చేసినవారు ఇది మళ్ళీ తెలుసుకున్న సత్యం..!

"ఇండియన్ గ్రామాలలో సాంఘిక, ఆరోగ్య పరిశుభ్రమైన వనరులు లేవు. రోడ్లు లేవు.మురుగునీటి పారుదల సౌకర్యాలు, వీధి దీపాలు లేవు. ఒక్క నీటిబావి మినహా ఇతర త్రాగునీటి వనరులు లేవు. పురుషులు, స్త్రీలు, పిల్లలు రోజంతా పొలాల్లోనూ, గేదెల చావిళ్ళలోనూ పనిచేసుకుంటారు..ఇన్ని గంటలూ చేసేది కేవలం చాలీ, చాలని ఆహారం కోసం, సరిపోని ఆదాయం కోసమే.." అని 1934 లో బ్రిటన్ నుండి వెళ్ళిన డెలిగేషన్ నివేదికలోనే ఉంది.

లిట్టన్ అనే ఆయన గవర్నర్ జనరల్‌గా వున్న 4 ఏళ్ళ కాలంలో (1876-80) ఒక కోటిమంది కరువు కాటకాల బారిన పడి అసువులు బాశారు. 1876లో అక్టోబర్- డిసెంబర్ కాలంలో దక్షిణ భారతదేశంలో లక్షలాది ఎకరాలలో పంటలు పండక ప్రజలు ఆకలితో అలంటిస్తుంటే ఏ మాత్రం పట్టించుకోని లిట్టన్, ఆయన పరివారం ఏమి చేశారో తెలుసా? విక్టోరియారాణి ఢిల్లీకి వచ్చే సందర్భంలో దేశంలోని రాజులు, నవాబులు, జమీందారులందరినీ సమీకరించి పండుగ వేడుకలో జరిపే ప్రయత్నాల్లో మునిగిపోయారు. ఆదే సమయంలో భారతదేశానికి కూడా మహారాణిగా ప్రకటించబడిన విక్టోరియా "ఈ దేశాన్ని, దేశ ప్రజలను సంతోష, సుభిక్ష, క్షేమ సౌభాగ్యాలతో అలరారేటట్లు చేస్తానని " 1877 జనవరి 1న ప్రతిజ్ఞ చేసింది.ఈ సందర్భంగా ఢిల్లీ నగరంలో 60 వేలమంది విందు విలాసాలాలో మునిగి తేలుతున్న ఆ వారం రోజుల వ్యవధిలో ఒక్క మద్రాసు, మైసూరు చుట్టుపక్కలే ఒక లక్షమంది పైగా ఆకలి కేకలలో ఆక్రందనలలో మునిగి..పైకి తేలలేక అసువులు బాశారు.

## *భారతీయులు బానిస కూలీలుగా మారి ఎలా వలస వెళ్ళారు?*

1833లో అంగీకరించిన బానిసత్వ చట్టం ప్రకారం బ్రిటన్, ఆఫ్రికన్‌లకు శాశ్వత విముక్తి కలిగించింది. కాని ఇతర బ్రిటిష్ వలస దేశాల్లో అధికారం చెలాయిస్తున్న భూస్వాములు తమ తోటల్లో పనిచేయడానికి కూలీలు దొరకనందువల్ల ప్రభుత్వం మీద విపరీతమైన ఒత్తిడి వచ్చింది. దాని ఫలితమేమిటంటే భారతీయుల్ని 'బానిసత్వ కూలీలు'గా మార్చడం. 1834- 1919 మధ్యకాలంలో లక్షలాది నిరుపేద రైతులు, నిరుద్యోగులు, ఇతర వృత్తులవారు, దక్షిణాఫ్రికా, కరేబియన్ దీవులు, మలేసియా, ఫిజి, మారిషస్ లాంటి దూరదేశాలకు తరలించబడ్డారు.

వేల యేళ్ళ నాగరికతకు, సంస్కృతికి, ఆధ్యాత్మిక విలువలకు వారసులైన ఈ వినూత్న బానిస కూలీలంటే బ్రిటిష్ భూస్వాములకు ఎంత చులకనా భావం ఉండేదో వారి మాటల్లోనే తెలుసుకుందాం.." ఇతర మానవ జాతులు చేయ నిరాకరించిన పనులను ఇంత అధమ జాతి కూలీలు తప్ప ఇంకెవ్వరూ చేయలేరు.."! ఈ విధంగా ఆంగ్లేయ ఘనులు ఒక రకం ప్రజలకు స్వేచ్ఛ నిచ్చి, వేరొక రకం ప్రజలను సంకెళ్ళు వేసి బానిసలుగా మార్చారు. రక్తం మరిగించే చారిత్రక సత్యం ఇది..!

మొదట్లో పురుషులకే పరిమితమైనా, ఆ తరువాత స్త్రీలను కూడా ఇతరదేశాలకు తరలించారు. బ్రిటిష్ ఏజెంట్లు మాయమాటలు చెప్పి, మోసం చేసి, బలాత్కరించి, ఎర చూపి మన వారిని పశువుల మందలుగా చేసి 'కూలీ ఓడల్లో'కి నెట్టి వేశారు. అధికారుల ఒడంబడిక ప్రకారం రవాణా ఖర్చులు ప్రభుత్వమే భరించేట్లు ఐదు సంవత్సరాల కాంట్రాక్ట్‌తో మొదలుపెట్టారు. అది పూర్తయిన తర్వాత మరో ఐదు సంవత్సరాలు పనిచెయ్యొచ్చు లేదా స్వదేశం తిరిగి రావొచ్చు అని షరతు పెట్టారు. కొత్త దేశంలో కూలీల జీతాలు, ఇతర ఖర్చులను భూస్వాములే భరించాలి. కాని యజమానులు ఈ ఒడంబడికలను చాలా అరుదుగా పాటించేవారు. ఇంకో భయంకరమైన వాస్తవమేమిటంటే ఎన్ని ఐదు సంవత్సరాలు గడిచినా బానిసత్వ బందీలకు మాత్రం విముక్తి దొరకలేదు.!

ఓడల్లో క్రింది భాగంలో పురుషులను, పై భాగంలో స్త్రీలను ఉంచి తీసుకెళ్ళేవారు. పై అంతస్థులలో ఉన్న స్త్రీలు. అధికారుల

లైంగిక వాంఛలకు బలి అయ్యేవారు. ఆ ఓడలలోని ప్రయాణ వసతులు ఎంత హీనంగా ఉండేవంటే అవి పశువులనురవాణా చేయడనికి కూడ పనికిరానివి. ప్రయాణంలో చనిపోయిన వారి శరీరాలను సముద్రంలోకి విసిరేసేవారు.

తోటల్లోకి వెళ్ళిన ఇండియన్ కూలీలు, ఏ చిన్న పొరబాటు చేసినా దండన ఏమిటంటే - కొరడా దెబ్బలు! వాతలు..!! ఒక్క రోజైనా అనారోగ్య కారణంగా పనిచేయలేకపోతే జైలే గతి!..సంకెళ్ళు వేసి కూడా వారితో బలవంతంగా పనిచేయించేవారు. ఈ కారణాల వల్ల మరణాల సంఖ్యకూడా అధికంగానే ఉండేది. 1834 నుంచి 83 సంవత్సరాల కాలంలో 15 లక్షలమంది మారిషస్‌కి, 238, 909 మంది బ్రిటిష్ గయానాకు, 143,939 మంది ట్రినిడాడ్ కు, 42,326 మంది 'గువాడులుపె' కు, 34, 620 మంది జమైకాకు, 34,000 మంది సురినామ్ కు, 25, 909 మంది మార్టినిక్ కు..ఇంకా లెక్కలకు అందనంతమంది మరికొన్ని దేశాలకు బానిస బందీలుగా వెళ్ళారు. 1844-1941 మధ్యలో మలేషియాకు 27 లక్షలమంది, 1860-1911 మధ్యలో దక్షిణాఫ్రికాకు 150,000 మంది 1879-1917 మధ్యలో ఫిజి దీవులకు 789,00 మంది తరలించబడ్డారు.

ఈ భారత బానిస కూలీలు వారు వలస వెళ్ళిన దేశాల ఆర్థిక, సాంస్కృతికాభివృద్ధికి ఎంతగా తోడ్పడ్డారనేది బార్బడాస్ నవలాకారుడు జార్జిలామింగ్ ఇలా వ్రాశాడు.." ట్రినిడాడ్‌లో గాని, గయానాలో గాని ఈ భారతీయుల చేతులే మాకు అన్నం పెట్టాయి. ఈ భారతీయులు ఉన్నందువల్లనే ఈ దేశాల ప్రజలు ఒక ఉదాత్త నాగరికను, మానవ సంబంధిత సంస్కృతిని నేర్చుకోగలిగారు. ఎన్నో తరాలుగా మానవత్వ విలువలను నింపి, వెలుగును చూపించిన ఈ భారతీయులు లేకుండా ట్రినిడాడ్, గయానాలకు చరిత్ర అనేదే లేదు..."

మరి ఇతరుల మనస్సులను ఇంతగా ప్రభావితం చేసిన మన భారతీయులని ఆంగ్లేయులు ఎందుకు దగ్గరకు తీసుకోలేకపోయారు, ఎందుకు భారతీయతకి అంటీ ముట్టనట్లు ఉండిపోయారు అనేది మాత్రం ఎవరికీ అంతుపట్టని విషయం..!

*నా మాట:*

మన ప్రియభారతదేశం ఈ రోజున అనేక సమస్యలతో సతమౌతూ ఉన్నా ఈ మాత్రమన్నా ఉన్నత స్థితిలో ఉందంటే అందుకు కారణం - మన పూర్వీకులు చేసిన బలిదాన ఫలితమే, త్యాగాల పుణ్యమే, నిస్వార్థసేవలే. వాళ్ళు లేనిదే మనం లేము. వాళ్ళకి హృదయాంజలి ఘటిస్తూ, మనం మన పిల్లలకు భావితరాల వారికి ఆధ్యాత్మికంగా , సాంస్కృతికంగా, భాషా పరంగా ఏమిస్తున్నాం అనే విషయం గురించి మనలో ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన విషయం..!

రాబోయే సంచికలలో - భారతావని ప్రగతి సౌధంలో పూర్తిగా వెలుగు చూడని చీకటి కోణాల గురించి తెలుసుకుందాం. వేచి చూడండి!

రచయిత ఇ మెయిల్ - dr_vs_rao@yahoo.com

